


**మూలికా భూషణ్**

# "ఒరేయ్ సత్యంగారూ"

(కథాకాలం 1920-24)

"ఏరోయ్ సత్యంగారూ." బయటినుంచి పొలికేక వినిపించింది."

సరసమ్మగారికి అరికాలిమంట నసాళానికి అంటింది. భోజనంచేస్తూఉన్న భర్తవైపు చురచురా చూచారు. ఆయన అపరబుద్ధుడులా వంచినతల పైకిఎత్తకుండా సెమరువేస్తూ ఉన్నాడు.

"ఒరేయ్ ఇన్‌స్పెక్టర్ గారూ, భోజనం చేస్తున్నావేమిట్రా పంతులుగారూ" బయటి నుంచి తిరిగి పొలికేక వినిపించింది.

భర్త ఉలకలేదు. పలకాలేదు. సరసమ్మగారు కోపంతో వణికిపోయారు. చేతిలో నేయిగిన్నె క్రిందపడింది. సరసమ్మగారు ఊరక ఉండలేకపోయారు. భర్తను ఉద్దేశించి కోపంతో సాధింపు ప్రారంభించారు.

"ఏమండీ, అతగాడు గౌరవం మర్యాద లేకుండా అలా పిలుస్తూఉంటే ఎన్నాళ్ళని మాట్లాడక ఊరుకుంటారు? బుద్ధివచ్చేలా ఇంతగడ్డి పెట్టరాదుటండీ? పైగా వీధిలోంచి ఏమిటా కేకలు? ఎవరుఅయినా వింటే ఏం బాగుంటుంది? చాలా అసహ్యంగా ఉందండీ. నేనైతే మొగం తగలేద్దును" అన్నారు ఆమె.

రెవెన్యూ ఇన్‌స్పెక్టరు శ్రీ తంగెళ్ళ వీర వెంకట సుబ్రహ్మణ్య సత్యనారాయణరావు పంతులుగారు భార్యకు వినిపించకుండా లోపలే ఒక నిట్టూర్పు విడిచారు. ఆవతలి మనిషి సంగతి పాపం! భార్యకు తెలియదు. పెద్దమనిషితరహా అని, గౌరవమర్యాదలు అని ఏవో మడిగట్లు పెట్టుకొని సామాన్యులు జీవితాలు గడుపుతారు. బయటినుంచి పొలికేకలు పెట్టే మనిషి, అలాంటివాటికి అతీతుడు. ఏమైనా అంటే కథ మరింత చెడుతుంది. బ్రతుకు ఇంకా దుర్భరం అవుతుంది. ఇప్పటి మట్టుకు ఈ పీడ సహించడంకన్న మార్గం లేదు. సరసమ్మగారి మాటలు వింటే చివరికి పీక తెగకోసుకోనవలసినగతి పట్టుతుంది.

భార్యమాటకు సమాధానం చెప్పటానికి సత్యంగారు ప్రయత్నించలేదు.

"నెయ్యి ఒలికింది. ఎత్తు" అని నీరసంగా అని భోజనం ముగించుకొని వీధిగదిలోనికి వెళ్ళిపోయారు ఇన్‌స్పెక్టరుగారు.

కోపం సంబాళించుకోనలేక సరసమ్మగారు భర్తవెళ్ళినవైపు శూన్యంగా చూస్తూ అలానే నిల్చుండిపోయారు.

* * *

అది అమలాపురంతాలూకా - సబ్‌డివిజన్‌లో-గ్రామం. సత్యంగారు ఆ గ్రామానికి వచ్చి రెండేళ్లు కావచ్చింది. ఏడాదిన్నర పాటు జీవితం ప్రశాంతంగా గడిచిపోయింది.

వెంకటరాజు ఆ ఊరు ఎప్పుడువచ్చాడో తెలియదు. అతనితో పరిచయం ఏర్పడడంతో సత్యంగారి జీవితం తారుమారు అయింది.

రెవెన్యూ ఇన్‌స్పెక్టరు ఉద్యోగం వస్తుతః చాలాచిన్నది. అయితే ఏం? అంత చిన్న ఉద్యోగికూడా తన ఫిర్కాలో కలెక్టరులా బ్రతుకుతున్న రోజులు అవి. కానీకి రూపాయి విలువ ఉన్న పుణ్యకాలం అది. బస్తాధాన్యం రెండుం పావలాకు ఇస్తాను నాయనా తీసుకోంటావా అని బ్రతిమాలినా "తరువాత వస్తాలెండి" అంటూ షావుకార్లు దాటవేస్తున్న యుగం అది.

రెవెన్యూ ఇన్‌స్పెక్టరుగారికి కొదవ ఏమీ లేదు. ఏమీ కొనవలసిన అవసరమూ లేదు. అవసరాలుగురించి చెప్పనక్కరలేదు. అవే తీరిపోతూ ఉంటాయి. కోరికలు ఏమైనా ఉంటే ఊదడం తరువాయి నెర వేరిపోతాయి. ఇన్‌స్పెక్టరు కలెక్టరు అయితే ఇన్‌స్పెక్టర్ సతీమణి జమీందారిణి. గ్రామంలో ఎక్కడ అయినా ఆమెదే అగ్రతాంబూలం. ఇన్‌స్పెక్టర్ గారి బిడ్డడు చిన్న జమీందారు. కాలుక్రింద పెట్టనివ్వరు. దేవుడు ఇచ్చిన కాళ్ళకు పని ఉండదు, స్వారీకి అలవాటుపడితే చాలు.

సత్యంగారు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గా పనిచేసిన మొదటి ఫిర్కా అది. ఇన్‌స్పెక్టర్

అంటే ఇలా ఉండాలి, అలా మాట్లాడాలి, దర్జా చూపాలి, తేలికగా నవ్వరాదు అని గిరి గీసుకొని వచ్చాడాయన ఊరిలో రాజులు అధికం పెద్దకుటుంబాలు, సంపన్నమైన కుటుంబాలు అన్నీ క్షత్రియుల కుటుంబాలే కనుక సత్యంగారి అంచనా ప్రకారం జీవితం సాగిపోవడానికి ఏలాంటి ఆటంకమూ లేకుండా పోయింది

ఇన్‌స్పెక్టరుగారి భార్య నరసమ్మగారు కూడా దర్జాగా బ్రతకడానికి అలవాటు పడ్డారు ఇన్‌స్పెక్టరుగారి ఏకైక కుమారుడు రామం ప్రభుత్వనౌకర్ల భుజాల మీద స్వారీకి అలవాటుపడ్డాడు ప్రభుత్వనౌకర్లు ఇన్‌స్పెక్టరుగారి స్వంతనౌకర్లే కాదంటే వారి బ్రతుకు కడతేరదు కదా!

ఇదంతా మధురమైన స్వప్నం ఈ స్వప్నాన్ని పీడకలగా మార్చిన రాక్షసుడు వెంకటరాజు

* * *

గౌరవమర్యాదలు క్షత్రియుల సొమ్ము వారిలో ఒక సంప్రదాయం ఉంది సాధారణంగా ఒక గ్రామంలో ఉండే క్షత్రియులు అందరూ ఒకేవంశంవారు అయి ఉంటారు కనీసం సన్నిహితమైన బంధుత్వం అయినా ఉంటుంది ఒకరి ఇంటికి గ్రామాంతరంనుంచి బంధువు ఎవరు వచ్చినా అతడు వరుసగా గ్రామంలో అన్ని కుటుంబాల ఆతిథ్యము పుడిసిపుచ్చుకొంటేతప్ప ఆ గ్రామంనుంచి బయటపడడానికి వీలు ఉండదు అందుచేత చుట్టపుచూపుగా వచ్చేవారు అర్థసంవత్సరమో కాదంటే సంవత్సరమో గ్రామం పొలిమేరకూడా దాటరు

అది పూర్వకాలమేమో బంధువులు వస్తే సంతోషించేవారే కాని రోదించేవారు అరుదుగా కాని కనిపించేవారు కారు

వెంకటరాజుగారు తుని తాలూకా— గ్రామంనుంచి వచ్చారు సంపన్న కుటుంబానికి చెందిన సోమరాజుగారికి కడుగొట్టు బావమరది కనుక గ్రామంలో కావలసినవారందరూ బావా అనే ఆయనను సంబోధించేవారు దానికితోడు వెంకటరాజుగారికి ఒక ప్రత్యేకత ఉంది ఆయన ఎవరినీ ఎప్పుడూ గౌరవించి ఎరుగరు, దేనిమీదా శ్రద్ధ లేదు కావలసినది లేదు అక్కర్లేనిది లేదు ఎప్పుడూ వెడనవ్వునవ్వుతూ ఉండడం తెలియక ఎవరు అయినా కోపం చూపించితే కొట్లాటకు సిద్ధం ముష్కరులలో ముష్కరుడు

వెంకటరాజుగారు గ్రామంలో ఉంటే ఉబుసుపోకకు ఆటంకం ఉండేదిగాదు విశేషాలు అన్నీ ఆయనతో పుట్టేవి ఆయన వచ్చినప్పుడల్లా కనీసం ఒక ఏడాదిఅయినా ఉండనిదే బంధువులు ఆయనను కదలనిచ్చేవారు కారు ఉన్నమాట ఏమంటే ఆ గ్రామంలోనే ఆయన స్థిరనివాసంఏ కొన్నాడు



# ★ 'ఒరేయ్ సత్యంగారూ' ★

వెంకటరాజుగారి బావగారు సోమరాజుగారు సరసులు. ఆయనలో స్వల్పమైన చిలిపితనంకూడా ఉంది.

సోమరాజుగారు ఎవరి విషయంలో అయినా విశేషమైన గౌరవ మర్యాదలు చూపేవారు. ఇది ఆయనకు సహజమైన ప్రవృత్తి. వయసులోకూడా పెద్దలు.

రెవెన్యూ ఇన్స్పెక్టరు సత్యంగారు గ్రామానికి వచ్చినప్పుడు ఆయనను ఆదరించి ఉండడానికి చక్కటి వసతి కల్పించినది సోమరాజుగారు. ఈ యువకుడు మొదట్లో ఎలా నడుచుకోవాలో తెలియక తికమక పడినప్పుడు వెంటపెట్టుకొని అడుగులు వేయడం నేర్పినది సోమరాజుగారు. కాని తరువాత తరువాత సత్యంగారు అధికారానికి మించిన దర్జా చూపించినప్పుడు సోమరాజుగారు నవ్వుకొన్నారు.

ఒకనాడు సత్యంగారితో పనిఉండి వారి గృహానికి సోమరాజుగారు వెళ్ళారు. సత్యంగారుమర్యాద చూపారు. కాని కుర్చీలోంచి లేవలేదు. సోమరాజుగారు ఔదార్యం చూపలేదు.

వెంకటరాజుగారు వచ్చారు. వెంకటరాజుగారికి ప్రపంచంలో ఎవరన్నా భక్తిశ్రద్ధలు ఉన్నాయో లేవో కాని సోమరాజుగారి మీద మాత్రం అఖండమైన భక్తి గౌరవం వున్నాయి. కారణం ఒక్కటే. తాను బావగారిని ఎప్పుడూ ఏమీ అనేవాడు కాడు. ఎవరు అయినా బావగారి ప్రసక్తి తెచ్చినా సహించేవాడూ కాదు.

*　　*　　*

ఊళ్ళో బాడ్మింటన్ కోర్టు వుంది. పత్రికారు ఖాళీ సమయాలలో బాడ్మింటన్ కోర్టులోనే మకాంపెట్టేవారు. పెద్దలు కూడా ఆడుతూ వుండేవారు.

సోమరాజుగారు గ్రామంలోకల్లా నిపుణులు అయిన ఆటవాడుగా పేరు పొందారు. సోమరాజుగారితో పాటు రెవెన్యూ ఇన్స్పెక్టరు సత్యంగారు కూడా అప్పుడప్పుడు బాట్ పట్టుకొనేవారు.

వెంకటరాజుగారు గ్రామానికి వచ్చిన రెండుమూడు నెలలకు కాబోలు ఒకనాడు సోమరాజుగారు, సత్యంగారు ఆటకు వచ్చారు. వెంకటరాజుగారు అంతకు ముందునుంచి ఆటలో ఉన్నారు. సోమరాజుగారు బావమరదిని సత్యంగారికి పరిచయం చేశారు.

బావమరది వైపు తిరిగి "ఇన్స్పెక్టరుగారు దర్జాపురుషులు, అధికారులు, మర్యాద తెలిసినవారు, వారి విషయంలో మర్యాద తప్పకు సుమా" అని బావమరదిని హెచ్చరిస్తూ చిరునవ్వు విసిరారు సోమరాజుగారు.

ఎన్నడూ లేనిది బావగారు తనను అవిధంగా హెచ్చరించడం, చిరునవ్వు నవ్వడం గమనించాడు వెంకటరాజు. సత్యంగారి వైఖరికూడా పరిశీలించాడు. బావగారి ఇంగితం అర్థంచేసుకొన్నాడు.

సోమరాజుగారి బావమరది కదా అని వెంకటరాజును తమగృహానికి ఆహ్వానించారు ఇన్స్పెక్టరు సత్యంగారు. వెంకటరాజుగారు రాకపోకలు ప్రారంభించారు. దానితో సత్యంగారికి రంపపుకోత ప్రారంభం అయింది.

*　　*　　*

వెంకటరాజు సంబోధన "పంతులుగారూ" తో ప్రారంభమై, "పంతులూ" లోకి దిగి "ఒరేయ్ పంతులూ" అయింది. "ఇన్స్పెక్టర్ గారూ" లోంచి "ఇన్స్పెక్టరూ" గామారి "ఒరేయి ఇన్స్పెక్టరూ" అయింది. లేకపోతే మర్యాద అమర్యాద అన్నీ కలిసేవి.

బాడ్మింటన్ కోర్టులో ఆటవేడిలో వచ్చిన ఈ పరిణామం ఊరివారు ఎవరికీ ఆశ్చర్యం కలిగించలేదు. అలా కాకపోతే అందరు ఆశ్చర్యపడి ఉండేవారు. వెంకటరాజు మారిపోయాడేమోనని బెంగపడి ఉండేవారు.

కాని సత్యంగారు ఈ అవమానం సహించలేకపోయారు. బాడ్మింటన్ కోర్టులో ఎప్పుడుఅయినా చిరాకు పడితే "ఊరుకొంటారేమండీ ఇన్స్పెక్టరుగారూ, వెధవకి చీవాట్లు పెట్టండి" అని తోడి ఆటగాళ్ళు సలహా చెప్పేవారు. వెంకటరాజును మాత్రం ఏమీ అనేవారు కారు.

ఒకరోజు సోమరాజుగారు ఉండగానే ఈ భాగవతం నడిచింది. సత్యంగారు చిరాకుపడ్డారు.

"ఈ కుర్రకారుతో చేరితే అంతేనండి. మర్యాదకూడా దక్కదు" అన్నారు సోమరాజుగారు. బాడ్మింటన్ మానివేస్తే నీ బాగా ఉంటుందేమోనని సూచించారు. సత్యంగారు బాడ్మింటన్కోర్టుకు వెళ్ళడం మానుకొన్నారు. సోమరాజుగారు మాత్రం ఎప్పటివలె ఆట కాలక్షేపం సాగిస్తూనే ఉన్నారు.

అయితేమాత్రం ఏమి ప్రయోజనం? ఇప్పుడు పీడ సరాసరి సత్యంగారి ఇంట్లోనే మకాం పెట్టింది.

*　　*　　*

తెల్లవారడం తరువాయి. వెంకటరాజు చక్కా వచ్చేవాడు.

"ఏరోయ్ ఇన్స్పెక్టరూ, చుట్టలపెట్టి ఎక్కడ దాచారండీ" అంటూ వీధిగదిలో అడుగుపెట్టేవాడు.

ఒక చుట్టఇస్తే దండకమండలంలో నీళ్ళు ప్రోక్షిస్తాడని సత్యంగారికి అనుభవంవల్ల తెలుసు.

చుట్టలపెట్టె అందజేస్తే కావలసినన్ని కాల్చి, ఇన్ని జేబులో వేసుకొని వెళ్ళిపోయేవాడు వెంకటరాజు.

చుట్టలు తక్కువగా ఉంటే ఉన్నవన్నీ స్వంతంచేసుకొని, "మధ్యాహ్నం వస్తాను, అప్పటికి చుట్టించి పెట్టరా సత్యంగారూ" అని చెప్పి వెళ్ళేవాడు.




MVKR Advtg.

చుట్టలపెట్టె ఖాళీగా ఉంటే నిజంగా ప్రమాదం వచ్చినట్లే. నౌకర్ని పిలిచి "ఇన్‌స్పెక్టరుగారికి చుట్టలు పట్రాపోయ్" అని పురమాయించే వారు రూపాయో రెండో వదిలించేవాడు. అందుకని సత్యంగారు ఏమరకుండా ఎల్లవేళలా చుట్టలు పుష్కలంగా అమారుగా ఉంచేవారు.

వెంకటరాజు ఆవేళ ఈవేళ అనకుండా ఎప్పుడుపడితే అప్పుడు వచ్చేవాడు. వచ్చాడంటే సత్యంగారి పని సాగేదికాదు. వెంకటరాజు అయన్ను పనిచేయనిస్తే గదా!


వెంకటరాజు సర్వస్వతంత్రుడు. సత్యంగారు ఇంట్లో ఉన్నా లేకపోయినా వెంకటరాజుకు ఆటంకం ఏమీ లేదు. సరాసరి వీధిగదిలోకి వెళ్లేవారు. నౌకర్ని పిలిచి చుట్టలపెట్టె తెప్పించేవాడు. యథేచ్ఛగా పొగ త్రాగేవాడు. చుట్టలు అయిపోతే నౌకర్ని పంపి ఇన్‌స్పెక్టరుగారి పేరుమీద నాణ్యమైన పొగాకు తెప్పించి చుట్టలు చుట్టుకొనే వాడు. ఇన్‌స్పెక్టరుగారికి ప్రతి నెలా అదొక పద్దు.

సత్యంగారికి ఇది ఒక్కటే తలనొప్పి అయితే బాధలేకపోను. వెంకటరాజు అడపా తడపా "ఒరేయి ఇన్‌స్పెక్టరూ! ఐదు రూపాయలు ఇవ్వరా, పది యివ్వండీ" అని అడిగి పట్టుకుపోయేవాడు.

కాదు కూడదు అనడానికి సత్యంగారు ఏనాడూ సాహసించలేకపోయారు. సోమరాజుగారి బావమరది వెంకటరాజు. సోమరాజుగారు ఊళ్లోకల్లా మోతుబరి రైతు. సోమరాజుగారివల్ల సత్యంగారు ఉపకారంపొంది ఉన్నారు. ప్రత్యుపకారంచేసే ప్రసక్తి ఏనాడూ లేదు. అలాంటప్పుడు వెధవ మట్టిముక్కలకో ముష్టి మూడురూపాయలకో రెవెన్యూ ఇన్‌స్పెక్టరుగారు ముఖం చూచుకొన్నారనే అపప్రథ తప్ప సాధించే దేమి ఉంది?

ఏదో ఒకటి అవుతుంది తెగించి మనిషిని ఏదో అనేసి ఈ పీడ వదలించుకోవాలని కూడా సత్యంగారు ఆలోచించకపోలేదు. కాని మనిషి ముష్కరుడు. చేయిచేసుకొన్నా చేసుకోగలడు. ముష్కరులని గ్రామంలో పేరుపడినవాళ్ళే అతని సమక్షంలోను పరోక్షంలోను కూడా మనిషి పేరుచెబితే నోరు మెదపరు. పట్టణవాసంలో నాటివరకు జీవించిన సత్యంగారికి కొట్లాటలంటే తగని భయం. పైగా సోమరాజుగారితో కోరి శత్రుత్వం తెచ్చుకొనడం అవుతుంది. అంటే గ్రామంతోనే వైరుధ్యం. ఇంక అక్కడ బ్రతకడం సాధ్యమా? ఈ సంగతి అంతా పై అధికారుల చెవినిపడితే ఉద్యోగంలో ఏలాంటి బాధలు వస్తాయో!

పోనీ తాను ఇంటిలో లేనప్పుడు అయినా తన నౌకర్లను పంపి తన పేరుమీద పొగాకు



పార్వతి

చిత్రకారిణి: వజ్రాల శారద మంతెన.

కొనకుండా కట్టడిచేస్తే బాగా ఉంటుందేమోనని ఆలోచించారు సత్యంగారు. అది సాధ్యంకాదు. నౌకర్లు వెంకటరాజు గులాములు. వాళ్ళకు సత్యంగారు ఇచ్చేది స్వల్పం. కాని వెంకటరాజు ఉదారంగా చాలా తరచుగా అడగకుండానే వాళ్ళకు రూపాయి అర్ధ ముట్టజెబుతూ ఉంటాడు. అందులో ప్రతి పైసా సత్యంగారిదగ్గర ఆర్జించినదే. అయితే ఏమి? సత్యంగారు చూచి చూచి ఇవ్వలేకపోయిన డబ్బు ఆయనదే అయినా వెంకటరాజుద్వారా ముట్టుతూ ఉన్నందుకు ఆ ప్రభుత్వ నౌకర్లు బాహాటంగానే వెంకటరాజు అడుగులకు మడుగులు ఒత్తుతూ ఉంటున్నారు. అలాంటి వాళ్ళతో వెంకటరాజుకు విరుద్ధంగా ఏమైనా చెప్పడం తద్దినం కొనితెచ్చుకోవడం.

ఇదంతా చనువు, అభిమానం, మైత్రి అనుకుందామా వెంకటరాజు పదిమందిలో మరీ రెచ్చిపోతూ ఉంటాడు.

"మన సత్యంగారికి ఇన్‌స్పెక్టరుకూడా తగనిదర్జా ఉందండి. అసలు తహసీల్దారుగా ఉండవలసిన మనిషి కలెక్టరుగా పుట్టినా బాగుండేది. ఏది ఒరేయ్, ఓచుట్ట ఇలాపారేయి" అంటూ ఉంటాడు.

ఎక్కడికి అయినా బదిలీచేయించుకొందామని కూడా సత్యంగారు అనుకొన్నారు. పైఅధికారులతో అన్యాపదేశంగా మనవి చేశాడు. మరొక ఏడాది ఇక్కడే ఉంటే బాగా ఉంటుంది. అని వారు సలహా చెప్పారు. దరఖాస్తు పెట్టుకొనడానికి సత్యంగారే సాహసించలేకపోయారు. ఇదే మొదటి ఛార్జి. అడుగులోనే హంసపాదు అన్నట్లు మొదటి ఛార్జిలోనే బదిలీకోరుతూ అర్జియా? పైగా ఊళ్ళో జీవితం అన్నివిధాలా బాగాఉంది. మరొకచోటకూడా ఇంత అనుకూలంగాను ఉంటుందనుకొనడం అవివేకం కాదా? ఎవరు చెప్పగలరు?

వెంకటరాజుపీడ తప్పించి మరొకబాధ ఏమీ లేదు. ఊళ్ళో గౌరవమర్యాదలకు ఏలాంటి లోటూలేదు. ఒక్క వెంకటరాజు మూలంగా బదిలీచేయించుకొని వెళ్ళడం పిరికితనం కాదా? అని ఆ సంకల్పం విరమించుకొన్నారు సత్యంగారు.

* * *

ఇదీ సత్యంగారి నిస్సహాయతకు, వరసమ్మగారి కోపానికి వెనుక దాగిఉన్న చరిత్ర.

ఇది ఇలాఉండగా...

* * *

మానవ విరచితమైన నాటకం జగన్నాటకంలో భాగం. నాటకం సాగేటప్పుడు ఆయాపాత్రలు నిర్ణీతమై పద్ధతి ననుసరించి ప్రవేశం, నిష్క్రమణం సాగిస్తూ ఉంటాయి. కొంత చెబుతాయి. చాలా చెప్పవు. మనం కొంత అర్థంచేసుకొంటాము. నేపథ్యంలోంచి కొంత వినిపిస్తుంది. కొంత ఊహించుకొంటాము. మొత్తంమీద సమగ్రమైన రూపం కల్పించుకొంటాము. దానితో సంతృప్తి చెందుతాము.

ప్రస్తుత సందర్భంలో జరిగినదికూడా అదే...

* * *

రెవెన్యూ ఇన్‌స్పెక్టరు సత్యంగారు గ్రామంలో లేరు. తహసీల్దారు సమ్మన్లు అందుకొని అమలాపురం వెళ్ళారు.

ఇంటిలో వరసమ్మగారు, రాము ఉన్నారు. ఒక నౌకరు ఇన్‌స్పెక్టరుగారి వెంట వెళ్ళాడు. రెండవ నౌకరు పాపాసాహేబు తోడుగా ఇంటివద్దనే ఉన్నాడు.

రాత్రి పదిగంటలవేళ నిద్రపోతూఉన్న

# ★ 'ఓరేయ్, సత్యంగారూ' ★

రామం—నాలుగేళ్ళవాడు—కడుపు నొప్పి అంటూ ఏడుస్తూ లేచాడు. సముదాయించినా ఊరుకోలేదు. జ్వరంకూడా ఉంది. నరసమ్మగారు కంగారుపడ్డారు.

ఆ గ్రామంలో డిస్పెన్సరీ ఉంది. డాక్టర్ శేషాచార్యులుగారి నివాసంకూడా డిస్పెన్సరీలోనే. నరసమ్మగారు పాపాసాహేబును పంపి డాక్టరును రప్పించారు. డాక్టర్ శేషాచార్యులుపిల్లవాడిని పరీక్షించి వెంటనే —గ్రామానికి పంపమని సలహా ఇచ్చారు. పిల్లవాడిని ఒక్క క్షణమైనా ఆలస్యం చేయకుండా కుదుపులేకుండా — గ్రామంలో ఆస్పత్రికి పంపాలని, లేకపోతే ప్రాణానికే ముప్పుమని డాక్టరుగారు హెచ్చరించారు. "అపెండిసైటిస్" అని, శస్త్రంకూడా ప్రయోగించాలని ఆయన అన్నారు— గ్రామం అక్కడికి సుమారు ఆరుమైళ్ళ దూరంలో ఉంది.

నరసమ్మగారికి అదేమీ అర్థంకాలేదు. పిల్లవాడి ప్రాణానికి అపాయమనీమాత్రం ఆ మాతృహృదయం అర్థంచేసుకొంది. భయం ఆవహించింది. దుఃఖం ఆపుకోలేకపోయింది. పిల్లవాడిని ఒడిలోపెట్టుకొని విలపించసాగింది.

పాపాసాహేబుకు మార్గం కనుపించలేదు. ఒక్క అంగలో సోమరాజుగారి ఇల్లు చేరుకొన్నాడు. సోమరాజుగారితో సంగతి అంతా చెప్పాడు.

అది నిజంగా పుణ్యకాలం. ఆ ప్రాంతంలో ఇంకా గుర్రపుబండ్లే లేవు. ఒంటెద్దు, రెండెడ్ల బళ్ళు, మేనాలుమాత్రమే భూచరులకు ఆధారం. వాటివేగం అందరికి తెలిసినదే. డాక్టరుగారేమో ఒక్క క్షణం ఆలస్యం జరిగినా ప్రమాదమేనని మరీ మరీ హెచ్చరించారు. ఇంక ఉన్న దిక్కల్లా సైకిలు. గ్రామంలో సైకిళ్లు వ్రేళ్ళమీద లెక్కపెట్టవచ్చు. ఉన్న సైకిళ్లు అన్నీ ప్రభల తీర్థం దర్శించగోరిన యాత్రికులు పట్టుకొని పోయారు. సైకిలు తొక్కగలిగిన కుర్రకారు ప్రభలతీర్థంలో ఉన్నారు. ఒకవేళ ఎవరు అయినా సైకిలు త్రొక్కగలిగినా నమ్మి పిల్లవాడిబాధ్యత అప్పగించడం సాధ్యమూ కాదు.

సోమరాజుగారు ఇరుకున పడ్డారు. ఊరక ఉండడం అసంభవం. ఉన్న దిక్కల్లా వెంకటరాజు. నాలుగురోజులుఅయి మూసిన కన్ను తెరవకుండా జ్వరంలో ఉన్నాడు. ఆవేళే జ్వరం మళ్ళింది. బహు నీరసంగా ఉన్నాడు. మరో రెండురోజులకు పథ్యానికి రావచ్చునని డాక్టరుగారు అన్నారు కాని విషజ్వరం, కదిలితే తిరగబెట్టుతుంది, ప్రాణాపాయం అని చెప్పారు.

సోమరాజుగారు సాహసించారు. వెంకటరాజును ఉన్నపళంగా రమ్మని పాపాసాహేబుచేత కబురు పంపి, సత్యంగారి ఇంటికివెళ్ళి అక్కడేఉన్న డాక్టరు శేషాచార్యులుగారితో మాట్లాడారు. అదృష్టవశాత్తు డాక్టరుగారివద్ద సైకిలుఉంది. సోమరాజుగారు అడగకుండానే ఆయన సైకిలు తీసుకొని వెళ్ళమన్నారు.

వెంకటరాజు రాగానే సోమరాజుగారు అడిగారు.

"బావగారూ, పిల్లవాడిని ఆస్పత్రిలో చేర్చుతాను. ప్రాణంపోయినా ఆపనిచేసి మరీచస్తాను. నా సంగతి మీకు తెలుసు. చెప్పక్కరలేదు. నాప్రాణం పోతుందే అనుకోండి. దాచుకొంటే లాభం ఏమిటి? స్నేహితులమని నమ్ముకొన్న సత్యంగారు ఊళ్ళోలేనప్పుడు. అడ్డుపడడం మనవిధి. మీ హృదయం నాకు తెలుసు. సైకిల్ తొక్కడంచేతకాదు గానీ మీకే వెడుగురుగదా! మీరు అయినా నేను అయినా ఒకటే. అనుమానించకండి. వెళ్లనివ్వండి" అన్నాడు వెంకటరాజు.

లోపలికి వెళ్ళి నరసమ్మగారితో "అమ్మా, వయసులో చిన్న అయినా మీరు నాతల్లి వంటివారు. మీ అబ్బాయిని భద్రంగా ఆస్పత్రికి చేరుస్తాను. నా ప్రాణం ఒడ్డుతాను. ఇవ్వండి" అన్నాడు.

వెంకటరాజు జీవితంలో చొరవచేసి పరస్త్రీల ఎదుటపడడం అదే మొదటిసారి. సుక్షత్రియుల అభిజాత్యం అలాంటిది. అంతటి అవసరమేగనుక లేకపోతే పరస్త్రీల ఎదుట

(46-వ పేజీ చూడండి)



# ★ 'ఓరేయ్, సత్యంగారూ' ★

(36-వ పేజీ తరువాయి)

పడకుండానే అతని జీవితం గడిచిపోతుంది.

వరసమ్మగారు కల్పించుకొన్న రూపం వేరు. ప్రత్యక్షమైన సౌమ్యమూర్తికి "తల్లీ" అని తనను సంబోధించే వినీతుడైన వ్యక్తి మూర్తికి ఆ కల్పితరూపంతో సంబంధంలేదు.

దుఃఖంలో ఉన్నప్పుడు ఎవరు నిజమైన స్నేహితులో హృదయమే చెబుతుంది. భారమంతా మోపడానికి అణుమాత్రమైనా సందేహించకుండా చేస్తుంది. ఈవిషయంలో బాలబాలికల మనఃప్రవృత్తికి దుఃఖ వివశులైన వారి మనఃప్రవృత్తికి భేదం కనిపించదు.

ఆలోచించేశక్తి ఆమెకులేదు. ఏది ఉచితమో ఏది కాదో తెలియదు. సోమరాజుగారి మాటలు విన్నదామె. వెంకటరాజు ముఖం చూచింది. భగవంతునిమీద భారం వేసింది. పిల్లవాడిని అందించినది.

బయట లోగొంతుకలో డాక్టరుగారికి సోమరాజుగారికి వాగ్యుద్ధం సాగుతూ ఉంది

"వెంకటరాజును పంపడం అతన్ని చంపడమే. పిల్లవాడిని పంపినా ఏమి కానున్నదో చెప్పడం కష్టం.

పంపకపోయినా అంతే, సందిగ్ధమైన ఫలితాన్ని ఆశించి నిశ్చయమైన చావు తెచ్చిపెట్టడం వివేకమా?" ఇది డాక్టరుగారి వాదం.

"వెంకటరాజు ప్రాణం పోవచ్చు. కాని సత్యంగారి కుమారుని ప్రాణం దక్కితే— ఆలాంటి అదృష్టమే గనుక సాధ్యమైతే అందుకోసం వెంకటరాజు ప్రాణం పోయినా సరే. నమ్మిన స్నేహితునికోసం ప్రాణత్యాగం ఏమంత గొప్పవిశేషం? ఇంతా చేసి ప్రయత్నం మనది. ఫలితం దైవాధీనం. ప్రయత్నం చేద్దాం. దీనికి వివేకంతో నిమిత్తంలేదు." ఇదీ సోమరాజుగారి సమాధానం.

వెంకటరాజు డాక్టరుగారి సైకిల్ మీద సత్యంగారి బిడ్డను భుజంమీద వేసుకొని ఆచీకటిలో—గ్రామంవైపు బాణంలా దూసుకొని వెళ్ళిపోయాడు. అప్పుడు రాత్రి పదిన్నర అయింది.

* * *

ఇంతవరకు జరిగినది ఒకలక్ష కాండిల్ పవర్ ఉన్న ఫ్లడ్ లైట్ల కాంతిలో రంగస్థలం మీద ప్రేక్షకుల సమక్షంలో

ముందునడిచినది నేపథ్యంలో— గ్రామంలో రోడ్డుప్రక్క చీకటిలో చెట్టుక్రింద నులకమంచంమీద నల్ల దుప్పటి ముసుగుదన్ని పడుకొన్న ఆసామీ సాక్షిగా.

* * *

—గ్రామంలో పోలీసు స్టేషన్ రోడ్డు ప్రక్కనే ఉంది. స్టేషన్‌అధికారి యువకుడు. రోజులు అయి ఆ గ్రామానికి వచ్చాడు. ఆ ప్రాంతంలో చట్టాలపట్ల గౌరవం సుతరామూ లేదని తెలుసుకొన్నాడు. చట్టాలపట్ల గౌరవం పునరుద్ధరించడానికి కంకణం కట్టుకొన్నాడు.

ఛార్జి అప్పగించిన వృద్ధ పోలీసు సబ్ ఇన్‌స్పెక్టరు చేసిన హెచ్చరిక ఆ యువకుని మనసులో నాటుకొన్నది. ఆ ప్రాంతంలో పెద్ద మనుషులు అయిన రౌడీల విషయంలో మాత్రం జాగ్రత్తగా మసలుకొమ్మని, అధికారం చూపడానికి నిలబెట్టుకొనడానికి ప్రయత్నించడం ప్రాణాపాయకరమని ఆ వృద్ధ అధికారి హెచ్చరించాడు. ఆలాంటివాళ్ళను సక్రమమైన దారికి తీసుకొని రావాలని నిశ్చయించుకొన్నాడు ఆ యువ అధికారి.

* * *

రాత్రి 11 గంటలు అవుతున్నది. లఘుశంక నివారించుకొనడానికి పోలీసు సబ్ ఇన్‌స్పెక్టరుగారు రోడ్డుదాటి అవతలి పక్కకు వెళ్ళుతున్నారు. అది చట్టానికి విరుద్ధమేఅయినా ఆ గ్రామంలో గత్యంతరం లేదు.

రోడ్డుమీద శరవేగంతో వస్తున్న సైకిల్ చప్పుడు వినపడింది. సబ్ ఇన్‌స్పెక్టరు పరికించి చూచారు. సైకిల్‌కు లైటులేదు. ఇది చట్టాలపట్ల గౌరవం పునరుద్ధరించడానికి అదను. ఇన్‌స్పెక్టరుగారు నిలబడ్డారు.

"ఏయ్ సైకిల్, ఆగు" అని గర్జించారు.

సైకిల్ ఆసామీ బ్రేకు వేసి, ఒకకాలు




నేలమీద అని, ఇన్‌స్పెక్టర్ వంక చూశాడు.

సైకిల్ ఆసామీ భుజంమీద పిల్లవాడు ఉన్నాడు. ఇది రెండవ నేరం.

"దీపంలేదు. పైగా ఇద్దరు. పద స్టేషన్‌కు పద" అన్నారు ఇన్‌స్పెక్టరుగారు గర్జిస్తూనే.

"నేరం అని తెలిసినా తప్పలేదు. పిల్లవాడు జబ్బుగా ఉన్నాడు. ప్రమాదస్థితి. ఆస్పత్రిలో చేర్చాలి. నన్ను పోనీయండి" అన్నాడు సైకిల్ ఆసామీ.

"వీలులేదు. సైకిల్ మీద నిలబడే మాట్లాడుతున్నావు. పొగరు కూడానా. పద స్టేషన్‌కుపద" అని రెట్టించారు ఇన్‌స్పెక్టరుగారు.

"ప్రమాదస్థితి అని ముందే చెప్పాను. పోనీయండి" అన్నాడు సైకిల్ మనిషి.

"దిగరా, ఇంకా మాట్లాడుతున్నావు" అని అరిచారు ఇన్‌స్పెక్టరుగారు.

"మీరు చేసిన అమర్యాదకు మరొక సమయం అయితే తగిన సమాధానం చెప్పి ఉండేవాడిని. ఇప్పుడు అయినా మించిపోయింది లేదు. నేను ఎప్పుడూ అబద్ధం చెప్పి ఎరుగను. పిల్లవాడిని ఆస్పత్రిలో చేర్చి రానీయండి. మీకు సంతృప్తికరమైన సమాధానం చెబుతాను. నేనెవరినో మీకు తెలియదు. చెబుతాను వినండి. నా పేరు వెంకటరాజు. మాది——గ్రామం (సోమరాజు గారి గ్రామం)" అన్నాడు వెంకటరాజు.

వృద్ధ ఇన్‌స్పెక్టరు పట్టికలోని పెద్ద మనుషులు అయిన రౌడీలలో ఆ పేరుకు చాలా ఉన్నతమైన స్థానం ఉంది. ఈ అవకాశం ఏమైనా జారవిడువరాదని నిశ్చయించుకొన్నారు ఇన్‌స్పెక్టరుగారు.

"దిగరా ముందు" అని బైసికిలు హాండిల్ బార్ చేతితో పట్టుకొని గద్దించారు.

పిల్లవాని ఒళ్ళు కాలిపోతూ ఉన్నది. జ్వరతీవ్రతలో అస్పష్టంగా చాలా సేపటి నుంచి ఏదో మూలుగుతూ ఉన్నాడు. ఇంక వెంకటరాజు సహించలేకపోయాడు. రెండవకాలు కూడా అవలికి తీసుకొని సైకిల్‌కు స్టాండు వేశాడు: భుజంమీద పైపంచె రోడ్డుమీద పరిచి పిల్లవాడిని దాని మీద పరుండబెట్టాడు. ఒక్క అంగలో ఇన్‌స్పెక్టర్ మీద పడి చొక్కా పట్టుకొని మొదలలోంచి కైజారు లాగి ఇన్‌స్పెక్టర్ పీకకు ఆన్చాడు. వెంకటరాజు భీమబలుడు. అతని చేతిపట్టు వదిలించుకొని అడుగు వెనక్కు వేయడం ఇన్‌స్పెక్టర్‌కు సాధ్యం కాలేదు. వెంకటరాజు క్రమంగా ఒత్తిడి హెచ్చించాడు. ఇన్‌స్పెక్టర్ చొక్కామీద రక్తం బొట్లు పడ్డాయి.

"పీక ఉత్తరించివేయనా? పోనిస్తావా" అని నెమ్మదిగానే అడిగాడు వెంకటరాజు.

"పిల్లవాడిస్థితి ప్రమాదంగా ఉంది. ఆస్పత్రిలో చేర్పడానికి మాట ఇచ్చాను. లేకపోతే ముందే నీపీక ఎగరవేద్దును. ఇప్పుడు అయినా మించినది లేదు. పోనిస్తావా" పిల్లవాడిని ఆస్పత్రిలో చేర్చి తిరిగివస్తాను. నీ ఇష్టంవచ్చినపని చేయి. ఓపిక ఉంటే బదులు తీయిస్తాను. లేదంటావ ఇప్పుడే ఉత్తరించి వెళ్ళుతాను. ఏమంటావు' అని అడిగాడు.

ఇన్‌స్పెక్టర్ చాలా ప్రయత్నంమీద గుటక వేశాడు.

"నావల్ల తప్పుఅయింది. ప్రాణం రక్షించండి. మీ ఇష్టంవచ్చిన చోటికి వెళ్ళండి" అని ప్రాధేయపడ్డాడు.

వెంకటరాజు అతనిని విడిచి, పిల్లవాడిని భుజంమీద వేసుకొని, సైకిల్ ఎక్కి ఆస్పత్రికి వెళ్ళిపోయాడు. 11 గంటలు అయింది. అంతా ఒక గంటలో జరిగిపోయింది.

* * *

పిల్లవాడిని ఆస్పత్రిలో చేర్పించినపిదప వెంకటరాజు పోలీసుస్టేషన్‌కు వెళ్లాడు. పోలీసు సబ్ ఇన్‌స్పెక్టరు అతనిమీద కేసు పెట్టలేదు. సంగతి తెలుసుకొన్నాడు. ఔదార్యం చూపాడు. మర్యాద కూడా చూపాడు. ఉభయులకు స్నేహం కుదిరినదని ప్రతీతి.

ఇది విష్కంభం.

* * *

తెల్లవారేసరికి వరసమ్మగారు, సోమరాజుగారు, పాపాసాహేబు, సోమరాజుగారి పరివారము రెండెడ్లబళ్ళలో——గ్రామం చేరుకొన్నారు.

రామానికి ఆపరేషన్ అవసరం అయింది. చేశారు. పిల్లవాడు గండంగడిచి బయటపడ్డాడు.

అమలాపురం వెళ్ళిన రెవెన్యూ ఇన్‌స్పెక్టరు సత్యంగారు అర్జంటు పనిమీద కాకినాడ వెళ్లారు. ఏవేవో పనులమీద గ్రామాలు తిరిగి వరసమ్మగారు పిల్లవాడు ఆస్పత్రినుంచి——గ్రామానికి తిరిగివచ్చిన రోజునే ఆయనా తిరిగివచ్చారు.

స్థిరంగా ఒకచోట ఒకరోజు అయినా ఉండకుండా తిరిగారు ఇన్‌స్పెక్టరుగారు. అందుచేత సోమరాజుగారు పంపిన కబురు చేరలేదు.

* * *

లోపలికివెళ్ళి బట్టలు మార్చుకొంటున్నారు ఇన్‌స్పెక్టరు సత్యంగారు. పిల్లవాడిని ఎత్తుకొని తీసుకొనివచ్చి జరిగినదంతా సవివరంగా చెప్పడానికి వరసమ్మగారు ఆవేదన పడుతున్నారు.

""ఏరోయ్ సత్యంగారూ, ఏంచేస్తున్నావురా" అని బయటినుంచి పాలికేక వినిపించింది.

పిల్లవాడికి అంత జబ్బుచేసి గండంలో పడడం, తాను సమయానికి ఊళ్ళో లేకపోవడం చూచాయగా అడుగుపెట్టుతూనే విన్న సత్యంగారికి మనసు వికలమైపోయింది. దానికితోడు తహసీలుదారుగారిచేత కొన్ని మాటలు పడవలసిన అవసరం కూడా పట్టింది. ఇంటికి వచ్చి ఇంకా జోళ్లు అయినా విప్పకొనకుండానే ఈపీడ ఒకటి.

సత్యంగారిలో సహనం నశించింది. కోపం పట్టలేకపోయారు.

"ఉండు. ఈపీడవదిల్చేస్తాను. ఈ వేళతో ఈ వెంకటరాజు కని సరి" అంటూ ఉగ్రులై కదిలారు.

వరసమ్మగారు నిశ్చేష్టురాలు అయ్యారు.

"అయ్యయ్యో, అలా అనకూడదండీ. ఆయన్ను ఏమైనా అంటే పుట్టగతులు ఉండవు. ఆరాత్రి నాలుగు లంఘనాలతో ప్రాణంవడ్డి ఆమహారాజు అబ్బాయిని ఆస్పత్రికి చేర్చారుగాని లేకపోతే మన బ్రతుకు ఏమయ్యేదండీ. వెళ్ళండి. పిల్లవాడిని చూపించి, ఆయనకు దండంపెట్టండి. ఏమి చేసినా ఆయన ఋణం ఈజన్మకి తీర్చుకోగలమా" అన్నది వరసమ్మగారు.

"ఏరోయ్ పంతులుగారూ, ఎంతసేపు అయిందీ వచ్చి." తిరిగి బయటినుంచి పాలికేక వినిపించింది.

కృతజ్ఞతతో పిల్లవాడు దక్కిన ఆనందంతో వరసమ్మ కళ్ళు చెమ్మగిల్లాయి.

సత్యంగారు శూన్యంగా ఆమెవంక చూస్తూ నిలబడిపోయారు. ★


## కల్లికోట కాలేజి లాటరి

ముగింపు: 23-5-59 * డ్రా 21-6-59.
889 ప్రయిజులకు రూ. 1,00,000 పంచి యిచ్చెదరు.
ప్రయిజులు రు 55000. రు 11000, రు 5000
టిక్కెట్టు 1 కి రు 1-00 న. పై.
పోస్టేజి 15 న. పై.
ప్రయిజులిస్టు 9 న. పై. అదనము.
మనియార్డరుచేసి టిక్కెట్లు కొనండి.
బి. జి. ఈశ్వరయ్య
పామిడి – అనంతపురంజిల్లా.



## అధైర్యపడవద్దు

శాస్త్రీయమైన, నిజమైన SEX—ADVICE పొందవచ్చును. మీకు ఉంటుకొన్న లక్షణములు వ్రాయుమూ, యింకా వివరాలకు కవరు పంపేది.
డాక్టర్ రత్నంసన్స్, (Estd 1904) మలక్‌పేటబిల్డింగ్స్, ఆజంపూరా మార్కెట్ వద్ద, హైద్రాబాద్ (దక్కన్)-2.A.P.